క్లుప్తంగా

రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు


మంత్రి ఆర్కేరోజా

నగరి : పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు మంత్రి ఆర్కే రోజా శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలతో ముస్లింలు నెలరోజుల పాటు స్వచ్ఛమైన దీక్షతో కఠినమైన ఉపవాస దీక్షను చేపట్టారని అందులో పేర్కొన్నారు. దీక్ష అనంతరం భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ సందర్భంగా అల్లా దీవెనలు వారికి పరిపూర్ణంగా అందించాలని ఆకాంక్షించారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: ప్రస్తుతం ఎండల తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో వడ్డదెబ్బపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ సూచించారు. శుక్రవారం ఆయన నరసింహాపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడారు.గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి 362 దరఖాస్తులు

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు సీడీపీఓ కార్యాలయ పరిధిలోని పూతలపట్టు, పెనుమూరు, జీడీనెల్లూరు మండలాల నుంచి మిషన్ వాత్సల్య పథకానికి 362 మంది దరఖాస్తు చేసుకున్నారని సీడీపీఓ వినతశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నూతనంగా మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టాయని, తల్లిదండ్రుల్ని కోల్పోయిన చిన్నారులు, తల్లి కానీ, తండ్రి కానీ కోల్పోయిన చిన్నారులు ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జీడీనెల్లూరు మండలంలో 111 మంది, పూతలపట్టు మండలంలో 118 మంది, పెనుమూరు మండలంలో 133 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆమె ప్రకటనలో తెలియజేశారు.

జీడీనెల్లూరులో వర్షం

గంగాధరనెల్లూరు: మండల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండకు తాళలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం ప్రజలకు ఉపశమనం కలగజేసింది. ఇక, ఇటుకలు తయారు చేసేవారికి వర్షం కొంత నష్టం కలిగించింది.

మృతురాలి కుటుంబానికి బీమా సాయం


మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కార్వేటినగరం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన జీ.భాగ్యలక్ష్మి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలను మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు గిరిజా రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, పంచాయతీ ఈఓ పీఎస్.మణి, చరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా



పాలసముద్రం : ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. సింహరాజుపురం గ్రామానికి చెందిన మునిక్రిష్ణ పాలసముద్రం నుంచి స్వగ్రామానికి ట్రాక్టర్‌తో బయల్దేరాడు. శ్రీకావేరిరాజుపురం కనవ (ఎత్తుపల్లాలతో కూడిన ప్రాంతం)పై వెళ్తున్న సమయంలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ ప్రాణాపాయం లేకుండా బయట పడ్డాడు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను యథాస్థితికి లేపి తీసుకువెళ్లారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ నాయకులు

పుత్తూరు రూరల్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) సామాజిక సేవల్లో ముందుంటుందని పుత్తూరు బ్రాంచ్ సెక్రటరీ ఎస్.లక్ష్మణకుమార్ తెలిపారు. బ్రాంచి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రెసిడెంట్ డి.దస్తగిరి చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం పూర్తిగా మినరల్ వాటర్‌తో చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పి.భాను, అధికారులు రమేష్‌బాబు, గంగులయ్య, అజయ్‌బాబు, యూనియన్ నాయకులు షణ్ముగం, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బోధనతోపాటు వసతులు తప్పనిసరి


ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న నాక్‌పీర్ టీమ్ అధ్యక్షులు

నగరి : విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మౌళిక సౌకర్యాలు కల్పించాలని నేషనల్ అసెస్‌మెంట్, అక్రెడిటేషన్(నాక్) కౌన్సిల్ పీర్ టీమ్ అధ్యక్షులు డాక్టర్ శైలేష్ జలా అన్నారు. డిగ్రీకళాశాలలో రెండురోజుల పాటు విద్యా విధానం, వసతుల కల్పనపై అధ్యయనం చేసిన నాక్ పీర్ కమిటీ శుక్రవారం కళాశాల బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమైంది. చైర్మన్ మాట్లాడుతూ రెండురోజుల పాటు విద్యా బోధన అంశంపై అధ్యయనం చేయడంతోపాటు ఆటస్థలం, ఇంకుడు గుంతలు, క్యాంటీన్, జిమ్ తదితర వసతులను ఆరా తీసినట్లు చెప్పారు.

నాక్ గ్రేడింగ్‌లో పరిగణించే అంశాలు

కరిక్యులం బోధనా, అధ్యయనం, మూల్యాంకనం, పరిశోధన, భౌతిక సౌకర్యాలు–గ్రంథాలయం, విద్యార్థుల ఉన్నత విద్య ప్రవేశాలు, క్రీడలు, ఉద్యోగాల కల్పన, నాయకత్వ పనితీరు, పరిపాలన, ఉత్తమ పద్ధతులు.

ఈ అంశాల ప్రకారం నివేదికను సిద్ధం చేసి నాక్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల సౌకర్యాలను, అవసరాలు తీర్చిన కళాశాలకు నాక్ మంచి గ్రేడ్ కేటాయిస్తుందని తెలిపారు. పరిశోధనలో సంఖ్య కంటే నాణ్యత ముఖ్యమన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను మెరుగుపరచాలని, సృజనాత్మకతను పెంపొందించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కోర్సులతో పాటు మరిన్ని పీజీ కోర్సులను ప్రవేశ పెట్టాలని సూచించారు. కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు, నక్షత్రవనం ద్వారా వృక్ష శాస్త్రాన్ని భారతీయ సంస్కృతితో మేళవించడం కొత్తగా ఉందని ప్రశంసించారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి ఆదర్శనీయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ కృషిని అభినందించారు. ఆంగ్ల విభాగం ప్రచురించిన గ్రంథాలకు అంతర్జాతీయ గుర్తింపు రావడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల మంచి గ్రేడ్ పొందడానికి అన్ని రకాల అర్హతలు కలిగి ఉన్నదని తెలిపారు. గ్రేడ్ వెల్లడిలో నాక్ పాత్ర 70 శాతం ఉంటే పీర్ టీమ్ పాత్ర 30 శాతం ఉంటుందన్నారు. రెండింటినీ కలిపి ఈ నెలాఖరులోపు గ్రేడ్‌ను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీర్ టీమ్ మెంబర్ కో–ఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఉజ్వల్ సింగ్, డాక్టర్ అయ్యపిళ్లై సెల్వకుమార్, ఐక్యూ కో–ఆర్డినేటర్ మురళీ మోహన్ రెడ్డి, కళాశాల విద్యాశాఖ ప్రతినిధిగా కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర రాజు, అకడమిక్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, ఎన్‌సీసీ అధికారి డా.భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపి, అధ్యాపకులు పంకజ, నాగార్జున, ఇందిరా ప్రియదర్శిని, అరుణ కుమారి, సుబ్రహ్మణ్యం, షర్మిల, రమణా రెడ్డి, ధర్మారావు, చిన్నపాపమ్మ, శ్రీనివాస్, మున్వర్, రామాంజులు, విజయ బాబు, రమేష్ బాబు, సుహాసిని, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన రహదారిని పరిశీలించిన తహసీల్దార్


శ్మశాన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం : మండలంలోని 50 బసివిరెడ్డిపల్లె దళితవాడ శ్మశాన రహదారిని తహసీల్దార్ లోకనాథపిళ్లై శుక్రవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈ గ్రామాన్ని సందర్శించినపుడు గ్రామస్తులు తమ ఊరికి శ్మశానం ఏర్పాటు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ తన సిబ్బందితో శ్మశాన రహదారిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామానికి ఎకరం స్థలాన్ని శ్మశానానికి కేటాయించామని, అయితే ఆ దానికి ఉన్న రహదారిని ఆక్రమించి, అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దీనికి ఇచ్చిన పట్టాను రద్దు చేసి, దారి సౌకర్యం కల్పించి, మిగిలిన భూమిని ప్రస్తుతం అనుభవిస్తున్న వారికి పట్టా ఇవ్వడానికి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, ఆర్ఐ త్యాగరాజులు, వీఆర్ఓ మోహన, సర్వేయర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యురాలికి పరామర్శ


జెడ్పీటీసీని పరామర్శిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్

నింద్ర: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల జెడ్పీసీ సభ్యులు మల్లీశ్వరిని శుక్రవారం ఇరుగువాయి గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పరామర్శించారు. ఆయనతోపాటు శ్రీశైలం ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి కూడా పరామర్శించారు. నగరి మాజీ మున్సిపల్ చైర్మన్ కే.జే కుమార్, వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, నగరి జెడ్పీటీసీ సభ్యులు గాంధీ, పుత్తూరు వైఎస్సార్ సీపీ నాయకులు అమ్ములు, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్ రెడ్డి, దుర్గాదేవి, మంజుల, సర్పంచ్‌లు సూర్య, మురళినాయడు, పరందామయ్య, జయచంద్రారెడ్డి, రాజేష్ చంద్రబాబు, దేవదాసు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కాపర్ చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- పట్టుబడిన తిరుపతి యువకులు
- 80 కిలోల కాపర్ స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలో నెల రోజులుగా వివిధ ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసులకు సంబంధించి నలుగురు నిందితులను శుక్రవారం వెదురుకుప్పం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. మండలంలోని జక్కిదొన, దేవరగుడిపల్లె, పచ్చికాపల్లం ప్రాంతాల్లో నెల రోజులుగా పలు దొంగతనాలు జరిగాయి. పొలాల వద్ద బోరు మోటార్ల, రాగి వైర్లు కత్తిరించుకుని అపహరించుకు వెళ్లారు. దీనిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శుక్రవారం పచ్చికాపల్లంలో వాహనాల తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిళ్లలో వెళ్తున్న తిరుపతికి చెందిన నలుగురు యువకులను అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద కాపర్ ఉండగా పట్టుకున్నారు. 80 కేజీల కాపర్ వైరు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాపర్ విలువ రూ.లక్ష విలువ ఉంటుందని అంచనా వేశారు. నిందితులు తిరుపతికి చెందిన ఠాగూర్, కార్తీక్, అరవింద్, మునికుమార్‌ను అరెస్ట్ చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు. వీరిపైన గతంలో విజయపురం పోలీసు స్టేషన్‌లో కూడా పలు చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసులో పురోగతి సాధించిన పోలీసు సిబ్బంది బాలాజీ, కల్యాణ్, విశ్వ, లక్ష్మణ్‌ను డీఎస్పీ అభినందించారని ఎస్ఐ పేర్కొన్నారు.

పారదర్శకంగా పాఠశాలల ఆడిట్


మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు రూరల్: పాఠశాలల సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఎంఈఓ తిరుమలరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 28వ తేదీ లోపు పాఠశాల కమిటీ సభ్యులకు సోషల్ ఆడిట్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ కుప్పయ్య మాట్లాడుతూ సోషల్ ఆడిట్ నిర్వహణ విధానాన్ని, సాంకేతిక మెలకువలను తెలియజేశారు. నాడు–నేడు, మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వరద వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


చందనాలంకరణతో దర్శనమిస్తున్న వరద వెంకటేశ్వరస్వామి

కార్వేటినగరం: అక్షయ తృతీయ, పరుశురామ జయంతి పురస్కరించుకుని మండలంలో సురేంద్ర నగరంలోని శ్రీవరద వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామివారికి చందనాలంకరణతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 6.30 గంటలకు కుంకుమార్చన, రాత్రి 8 గంటలకు స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు.అలాగే శనివారం ఉదయం 10.30 గంటలకు గురుపూజతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సమగ్ర విద్యపై శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీదేవి

నగరి : పాఠశాలల సామాజిక తనిఖీ, పనితీరు మూల్యాంకనం, సమగ్ర విద్యపై మండలంలోని ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో శ్రీదేవి శిక్షణ అందించారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ యాప్ ద్వారా సోషల్ ఆడిట్ సాధనాన్ని నింపడం, తల్లిదండ్రుల కమిటీ పాత్ర, సమగ్ర విద్యపై అవగాహన, విద్యా ప్రమాణాలు పెంపుదల, బడి బయట పిల్లలను పాఠశాలకు వచ్చేలా ప్రోత్సహించడం, మన బడి నాడు–నేడు, మధ్యా హ్నం భోజనం పాఠశాల భద్రత తదితర విద్యాశాఖ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీఎంవో ఉదయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు


కార్వేటినగరం : చాకలివాని గుంట ఎస్టీ కాలనీలో..

పాలసముద్రం : అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ అన్నారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలోని సింహరాజుపురం పంచాయతీలో వైస్ ఎంపీపీ శేఖర్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సీఎం పాలనపై సంతృప్తిగా ఉన్న ఇళ్లకు జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సుబ్రమణ్యరెడ్డి, విజయరాఘవరెడ్డి, గోపాల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని ఈస్టు ఏఏడబ్ల్యూ, డైట్ ఎస్టీకాలనీ, చాకలివానిగుంట ఎస్టీకాలనీలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రజలతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు నాయకులే పొందారని, పేదలకు పథకాలు అందని ద్రాక్ష అయ్యాయని, అయితే జగనన్న సీఎం అయ్యాక తమ ఇళ్ల ముంగిటకే పథకాలు అందుతున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


పాలసముద్రం : మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలు ఇస్తున్న నాయకులు


మంగళగిరి కండ్రిగ గ్రామంలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తూరులో ...

నింద్ర: మండలంలో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని అత్తూరు గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ జగనన్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ దుర్గాదేవి, మల్లికార్జుననాయుడు, రమేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు ముఖ్యం


సరస్వతీ పూజలో డైట్ ప్రిన్సిపల్ ప్రభాకర్, టీచర్లు, విద్యార్థులు

కార్వేటినగరం: విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండటం ముఖ్యమని, ఆ విలువలే వారికి మంచి పేరు తెస్తాయని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. డైట్ అనుబంధ ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సెల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ల విస్తృతి యువతపై దుష్ప్రభావం కలిగిస్తోందన్నారు. ఎంత ఉన్నత చదువులు చదివినా నైతిక విలువలు లేని చదువు వ్యర్థమని అన్నారు. ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, దేశం, సమాజం పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో జ్యోతి వెలిగించి సరస్వతీ పూజ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవ మందడి, కళ్యాణ్‌కుమార్, విమలావతి, కుమారస్వామి, మునిశేఖర్, హసీనాబేగం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నగరిలో క్రికెట్ మ్యాచ్ ప్రారంభం


సెంచురీ చేసిన సిద్ధు

నగరి : రోజా చారిటబుల్ ట్రస్టు సహకారంతో స్థానిక కేవీకే మైదానంలో రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌ను తొలిసారిగా నగరిలో నిర్వహించారు. శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో సంయుక్త చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా రెండు టీంలు చేసి మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన వీకేవై సిద్ధు తన ఖాతాలో 4వ సెంచరీని నమోదు చేసుకున్నారు. 138 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్సులతో 131 పరుగులు చేశాడు. సిద్ధును మంత్రి ఆర్కే రోజా అభినందించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోచ్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం స్వాధీనం


షాపును తొలగిస్తున్న ఆలయ అధికారులు

పుత్తూరు రూరల్: గత రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో గదిని ఖాళీ చేయించి, ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పుత్తూరు పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.మునికృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక షాపు నిర్మాణానికి నింద్ర మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన ఏ.రామ్‌ప్రసాద్‌కు బహిరంగ వేలం ద్వారా స్థలం కేటాయించామని పేర్కొన్నారు. రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో హిందూ దేవాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం గదిని ఖాళీ చేయించామన్నారు. సీఐ, మున్సిపల్ కమిషనర్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో షాపును స్వాధీనం చేసుకుని, గదిని నేలమట్టం చేశామని తెలిపారు. అనంతరం రామ్‌ప్రసాద్ ఆలయ స్థలంతో తనకు సంబంధం లేదని రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు, సభ్యులు, రమేష్, సుందరం, బాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

24 నుంచి సోమనాథేశ్వరాలయ కుంభాభిషేకం



ఆలయ ప్రాంగణం, ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులు

- శ్రీ లక్ష్మీగణపతి హనుమంతేశ్వరస్వామి దేవస్థానంగా నామకరణం
- రూ.2 కోట్లతో నిర్మాణం


సిద్దిరాజుకండ్రిగలో కుంభాభిషేకానికి సిద్ధమవుతున్న శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వరాలయం


ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న విద్యుత్ తోరణాలు

పిచ్చాటూరు: మండలంలోని సిద్దిరాజు కండ్రిగలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వర ఆలయ కుంభాభిషేకం ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయానికి శ్రీ లక్ష్మీగణపతి హనుమంతేశ్వర స్వామి దేవస్థానంగా నామకరణం చేశారు. ఆలయంలో పార్వతీ దేవి ఎదుట లింగ రూపంలో సోమనాథేశ్వరుడు కొలువై ఉంటారు. గ్రామంలో ఆంజనేయస్వామికి చిన్న ఆలయం ఉండేది. ఈ ఆలయం చుట్టు 0.55 సెంట్ల గుడి భూమి ఉంది. ఈ స్థలంలో పెద్ద ఆలయాన్ని నిర్మించాలనే అప్పటి గ్రామ ఉప సర్పంచ్ జ్యోతి రాజు తన సంకల్పాన్ని గ్రామస్తులకు చెప్పడంతో అందరూ దీనికి అంగీకరించారు. ఆలయ నిర్మాణానికి 2013లో భూమి పూజ చేశారు. దేశ విదేశాల నుంచి మిత్రుల నుంచి విరాళాలు సైతం సేకరించారు. రెండేళ్ల క్రితం గ్రామంలోని యువకులతో శ్రీ లక్ష్మీ గణపతి హనుమంతేశ్వరాలయ అభివృద్ధి సంఘం ఏర్పాటు చేసి అందరి సహకారంతో ఆలయ నిర్మాణ పనులను రూ.2కోట్లతో పూర్తి చేశారు. ఆలయంలో ఆంజనేయస్వామితో పాటు పార్వతీ సమేత సోమనాధేశ్వరస్వామి, లక్ష్మీగణపతి, లక్ష్మణ సమేత సీతారాములు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, కళ్యాణ నవగ్రహాలకు ప్రత్యేక ఆలయాలు నిర్మించారు.

కుంభాభిషేక కార్యక్రమాలిలా..

24,25,26వ తేదీలలో మహా కుంభాభిషేకం, 27న ఉదయం గంటలకు విమాన గోపుర కుంభాభిషేకం, సకల దేవతలకు మహా అభిషేకం, సంప్రోక్షణ, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 8 గంటలకు శివ పార్వతుల గ్రామోత్సవం, 28న సీతారాముల కల్యాణం, 29న శ్రీ వళ్లీ దేవసేన, శ్రీ సుబ్రమణ్యా స్వామి కల్యాణోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని జ్యోతిరాజు చెప్పారు. కుంభాభిషేకం జరిగే 6 రోజుల పాటు భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేయనున్నట్టు ఆయన తెలిపారు.